సాక్షి
నల్లగొండ
బుధవారం : 1 : ఫిబ్రవరి : 2023



బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. - 8లో



'యాదాద్రి' బస్ స్టేషన్ రెడీ

యాదాద్రి క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కొండకు దిగువన చేపట్టిన యాదాద్రి బస్‌స్టేషన్ నిర్మాణం పూర్తయింది. - 10లో

గరిష్టం/కనిష్టం
32°/18°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాలి

• ఎస్పీ అపూర్వరావు



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

డిండి : పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదుదారుడు వచ్చిన వెంటనే స్పందించి సమస్య పరిష్కార దిశగా పని చేయాలని ఎస్పీ అపూర్వరావు పోలీస్ సిబ్బందికి సూచించారు. నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆమె మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సమస్యలు, పరిస్థితులను ఎస్‌ఐ సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో సరిపడా సిబ్బందిని నియమించడానికి ప్రయత్నిస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిండి సర్కిల్ పరిధిలో పోలీసుల పనితీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేసారు. ఆమె వెంట దేవరకొండ డీఎస్పీ నాగేశ్వరరావు, డిండి సీఐ పరుశురాం తదితరులు ఉన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిషిప్‌కు దరఖాస్తులు

నల్లగొండ రూరల్ : ఆర్టీసీలో అప్రెంటిషిప్ కోసం ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌ఎం శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ డీజిల్ మెకానిక్ ట్రేడ్ కోర్సు పూర్తి చేసిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు ఈ నెల 5వ తేదీలోగా ఆర్టీసీ లాగిన్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 7 డిపోల్లో అభ్యర్థులు అప్రెంటిషిప్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎంజీయూ రిజిస్ట్రార్ పదవీకాలం పొడిగింపు

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణారావు పదవీకాలాన్ని పొడిగిస్తూ ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు రిజిస్ట్రార్‌గా కృష్ణారావు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

మిర్యాలగూడ : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు డిమాండ్ చేశారు. దామరచర్ల మండల కేంద్రంలో జరుగుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థి అమరవీరుల త్యాగాలు వృథా కాకుండా ఉండాలంటే విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకుగాను ఈనెల 5వరకు నిర్వహించే ఆందోళన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వినోద్‌నాయక్, నాగమణి, ధీరావత్ శ్రీను, ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, కొర్ర సైదానాయక్, రేణుక, బుడిగ వెంకటేష్, రమేష్, లక్ష్మణ్, జగన్, వీరన్న, ఉపేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని విస్మరించిన ప్రభుత్వాలు



మాట్లాడుతున్న వి.కోటేశ్వరరావు

నకిరేకల్ : కేంద్రంలో మోదీ, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వాలు రైతాంగాన్ని పూర్తిగా విస్మరించాయని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు విమర్శించారు. నకిరేకల్‌లోని యనాల మల్లారెడ్డి స్మారకభవనంలో మంగళవారం జరిగిన ఏఐకేఎంఎస్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో రాక ముందు రైతాంగానికి అన్ని రకాల రుణాలు, సబ్సిడీలు అందిస్తామని హామీ ఇచ్చిన మోదీ, కేసీఆర్ అధికారంలోకి వచ్చాక విస్మరించారని మండిపడ్డారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి జ్వాలా వెంకటేశ్వర్లు, న్యూడెమాక్రసీ జిల్లా కార్యదర్శి రాయి కృష్ణ, నాయకులు బీరెడ్డి సత్తిరెడ్డి, అంబటి వెంకటేశం, మందారి డేవిడ్, ఎర్ర రమేష్, వెంకన్న, ఇందూరు సాగర్, అంబటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



• శంభో శంకర



చెర్వుగట్టు శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున నిర్వహించిన అగ్నిగుండాల కార్యక్రమానికి తరలివచ్చిన భక్తులు



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు - నార్కట్‌పల్లి

రుణమాఫీకి కేంద్రం నిధులు కేటాయించాలి

• సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : దేశంలో రైతుల ఆత్మహత్యలను నివారించేందుకుగాను కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఏకకాలంలో రుణమాఫీకి నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎకనామిక్ సర్వేలో రైతుల ఆత్మహత్యల అంశాన్ని ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధరలు అశాస్త్రీయంగా ఉన్నాయని, పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదన్నారు. వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఈసారైనా..

రైల్వే ప్రాజెక్టులపై ఉమ్మడి జిల్లా ప్రజల ఆశలు

- ఎంఎంటీఎస్ విస్తరణకు మోక్షం లభించేనా
- ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలకు నిధులు వస్తాయా
- కేంద్ర బడ్జెట్‌లో ప్రయోజనం దక్కేదెంతో?
- ఏటా జిల్లా ఎంపీల విజ్ఞప్తులను పట్టించుకోని కేంద్రం
- పింక్ బుక్ వచ్చాకే కేటాయింపులపై స్పష్టత



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కేంద్ర ప్రభుత్వం బుధవారం బడ్జెట్ ప్రవేశ పెడుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో రైల్వే ప్రాజెక్టులపై ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏటా బడ్జెట్ సమయంలో జిల్లాకు కావాల్సిన రైల్వే లైన్లు, రైళ్ల విస్తరణకు ఉమ్మడి జిల్లా ఎంపీలు విజ్ఞప్తులు చేస్తున్నా కేటాయింపులు మాత్రం జరగడం లేదు. ఈ సారైనా బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలకు మోక్షం లభిస్తుందా? లేదా? అని జిల్లా వాసులు ఎదురుచూస్తుండగా, జిల్లా మీదుగా హైదరాబాద్-విజయవాడ వరకు బుల్లెట్ ట్రైన్, రాష్ట్ర వాటా లేకుండా జనగామ వరకు ఎంఎంటీఎస్ పొడిగింపు దక్కుతాయా? లేదా? అన్నది బడ్జెట్‌లో తేలనుంది. రైల్వే కేటాయింపులపై మరో నాలుగైదు రోజుల్లో పింక్ బుక్ (రైల్వే శాఖలో చేపట్టిన చేపట్టాల్సిన పనుల సమాచారం) వచ్చాకే స్పష్టత రానుంది.

ప్రతిపాదనలపై ఏ నిర్ణయం వచ్చేనో..

జిల్లాలోని ఎంపీలు కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్ వంటి పలు రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలను అందజేశారు. వాటిపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై చర్చ కొనసాగుతోంది. ముఖ్యంగా ఎంఎంటీఎస్ రైలును జనగామ వరకు పొడగించాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎప్పటి నుంచో అడుగుతున్నారు. రాష్ట్ర వాటా లేకుండానే దానిని పొడిగించాలని రెండేళ్లుగా ఆయన డిమాండ్ చేస్తున్నాయి. అయినా ఇంతవరకు దానిపై నిర్ణయం వెలువడలేదు. దక్షిణ మధ్య రైల్వే సమావేశంలోనూ అది రైల్వే మంత్రిత్వ శాఖ ఆధీనంలోని రైల్వే బోర్డు పరిధిలోని అంశమని, తమ పరిధిలో లేదని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ నేపథ్యంలో వెంకట్‌రెడ్డి మరోసారి రైల్వే మంత్రికి ఎంఎంటీఎస్‌ను జనగామ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. వాటితోపాటు కేంద్రీయ విద్యాలయాల అప్ గ్రేడేషన్, నవోదయ విద్యాలయాల్లో సదుపాయాల కల్పనకు, వ్యవసాయదారులు అధికంగా ఉన్న జిల్లాలో ప్రకృతి, సేంద్రియ వ్యవసాయానికి కేంద్రం ఏమైనా బడ్జెట్‌ను కేటాయిస్తుందా? లేదా? అందులో జిల్లాకు ఏమైనా మేలు చేకూరుతుందా? అన్నది తేలనుంది.

బుల్లెట్ ట్రైన్‌కు ఎంపీల ప్రతిపాదనలు

హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు బుల్లెట్ ట్రైన్ వేయాలని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎప్పటినుంచో అడుగుతున్నారు. జాతీయ రహదారి 65 వెంట బుల్లెట్ వేస్తే 60 కిలోమీటర్ల దూరం తగ్గి 256 కిలోమీటర్లకే విజయవాడకు చేరుకోవచ్చు. ఎంతో రద్దీ కలిగి, రోజుకు 1500 బస్సులు నడిచే ఈ రూట్‌లో బుల్లెట్ ట్రైన్ వేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది. ముంబై-హైదరాబాద్ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు విస్తరణలో భాగంగా హైదరాబాద్-విజయవాడ బుల్లెట్ ట్రైన్‌ను మంజూరు చేయాలన్న డిమాండ్ ఉంది. దానికోసం ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్ చేసిన ప్రతిపాదనలు కూడా కేంద్రం పరిశీలనలోనే ఉన్నాయి.

పెండింగ్‌లోనే అనేక లైన్లు

- డోర్నకల్-మిర్యాలగూడ కొత్త రైల్వే లైన్ పనులు సర్వేకే పరిమితం అయ్యాయి. మిర్యాలగూడ, కోదాడ, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, నేలకొండపల్లి ప్రాంతాల్లోని వ్యవసాయ, పారిశ్రామికరంగాల వారికి ఎంతో ఉపయోగపడే ఈ లైన్ సర్వే పనులను కేంద్రం 2013-14 సంవత్సరంలో మంజూరుచేసింది. అయినా ఇంతవరకు ముందుకు సాగడం లేదు.
- బీబీనగర్-నడికుడి డబ్లింగ్ అంశం రైల్వే బోర్డు పరిశీలనలోనే ఉంది. 239 కిలోమీటర్ల దూరం కలిగిన ఈ లైన్ డబ్లింగ్‌ను గతంలోనే మంజూరు చేసింది. కానీ నిధులను ఇవ్వలేదు. డీటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టును పరిశీలిస్తూనే ఉంది.
- మోటమర్రి-విష్ణుపురం 90 కిలోమీటర్ల పొడవున ప్రస్తుతం సింగిల్ లైన్ మాత్రమే ఉంది. దానిని డబుల్‌లైన్‌గా మార్పు చేయాలన్న డిమాండ్ నెరవేరడం లేదు. 2021 జూలై 15వ తేదీన సర్వేకు కేంద్రం ఆమోదం తెలిపినా ముందుకు సాగడం లేదు.
- చిట్యాల రైల్వే స్టేషన్ నుంచి శ్రీరాంపురం మధ్య నార్కట్‌పల్లి మండలంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) కోసం ఎప్పటి నుంచో అడుగుతున్నారు. నియోజకవర్గంలోని పలు చోట్ల రైల్వే అండర్ బ్రిడ్జిలు కావాలన్న ప్రజలు డిమాండ్లు ఈ బడ్జెట్‌లోనైనా నెరవేరుతాయా? లేదా చూడాలి.

2016-17లోనే మంజూరైనా..

ఎంఎంటీఎస్ ఫేజ్-2లో భాగంగా రాయగిరి వరకు పొడగించేందుకు కేంద్రం 2016-17 ఆర్థిక సంవత్సరంలోనే మంజూరు చేసింది. రూ.330 కోట్లతో దీనిని చేపట్టేందుకు ఓకే చెప్పింది. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం మరో రూ.73 కోట్లు ఖర్చు అధికంగా అవుతుందని తేల్చింది. 2020 నాటికి పనులు పూర్తి చేయాలని ముందుగా నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న డబుల్ లైన్‌కు అదనంగా మరో లైన్‌ను చర్లపల్లి నుంచి రాయగిరి వరకు 34 కిలోమీటర్ల మేర వేయాల్సి ఉంది. అయితే అందుకు అయ్యే ఖర్చులో 2/3వంతు డబ్బు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని కేంద్రం మెలిక పెట్టింది. దీంతో అప్పటి నుంచి ఎంఎంటీఎస్ విస్తరణ కాగితాలకే పరిమితమైపోయింది.

బుద్ధవనాన్ని సందర్శించిన విద్యార్థులు



బుద్ధవనంలోని బుద్ధునిపాదాల చెంత ముంబయి యూనివర్శిటీ విద్యార్థులు

నాగార్జునసాగర్ : సాగర్ జలాశయతీరంలోని బుద్ధవనాన్ని ముంబయి యూనివర్శిటీ విద్యార్థులు మంగళవారం సందర్శించారు బుద్ధచరితవనం, జాతకవనం, స్థూపవనం, ధ్యానవనం తదితర ప్రాంతాలను సందర్శించి అధ్యయనం చేశారు. అనంతరం ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ఆ యూనివర్సిటీ పురావస్తు అధ్యయనకారుల విభాగపు హెచ్‌ఓడీ డాక్టర్ యోజన భగత్ మాట్లాడుతూ దేశంలోని పురాతన బౌద్ధచరిత్ర కలిగిన ప్రదేశాలను సందర్శించి అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. నాగార్జునసాగర్‌లో మహాస్థూపాన్ని నిర్మించిన తెలంగాణ పర్యాటక శాఖకు, బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్యకు ధన్యవాదాలు తెలిపారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం విశేషాలను వివరించారు.

జంతు హింస నివారణ చట్టాన్ని పాటించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు

• కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ : జంతు హింస నివారణ చట్టాన్ని ప్రతి పౌరుడు పాటించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో జంతు హింస నివారణ సంఘం సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవుల అవసరాలకనుగుణంగా అడవులు నరకడం, కొండలు, నదులు, సరస్సులు ఆక్రమించుకోవడం వల్ల కాలక్రమేణా జంతుజాలం అంతరించిపోతోందన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం జంతు రక్షణకు చట్టాలు చేస్తూ జంతు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం జంతువులు, పక్షులు, నీటిలో జీవించే జలచరాలను హింసించినా, హాని కలిగించినా జంతు సంక్షేమ బోర్డు శిక్షిస్తుందని చెప్పారు. ప్రతి పౌరుడు జంతు సంరక్షణకు పాటుపడాలని సూచించారు. జంతు హింస చేయరాదని, జంతువులపై కరుణతో ఉండి వాటిని సంరక్షించాలని చెప్పారు. నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లో స్లాటర్ హౌజ్‌ల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం పశు సంవర్ధక శాఖ జంతు సంక్షేమంపై ముద్రించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. తొలుత జంతు సంక్షేమ చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ యాదగిరి వివరించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్, రవాణాశాఖ అధికారి సురేష్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్, డీపీఆర్‌ఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రమణాచారి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఆర్టీసీ ఆర్‌ఎం



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి

సూర్యాపేట : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నల్లగొండ జిల్లా రీజినల్ మేనేజర్ శ్రీదేవి మంగళవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డిని సూర్యాపేటలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నూతనంగా ఆర్‌ఎంగా బాధ్యతలు చేపట్టడంతో పాటు యాదగిరిగుట్టలో చేపట్టే బస్ స్టేషన్ ప్రారంభోత్సవానికి మంత్రిని ఆహ్వానించారు. ఆమె వెంట సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సురేందర్ తదిరులు ఉన్నారు.

ఐలాపురంలో ఉద్రిక్తత

- చెరువు శిఖం భూముల కబ్జాకు పలువురి యత్నం
- పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపిన గ్రామస్తులు



ఐలాపురంలో చదును చేసిన భూమి

మిర్యాలగూడ : మండలంలోని ఐలాపురంలో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చెరువు శిఖం భూములను కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తుండడంతో గ్రామస్తులు పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. మిర్యాలగూడ మండలంలోని ఐలాపురం గ్రామంలో సర్వే నంబర్ 85లో చెరువును ఆనుకుని గ్రామ సరిహద్దులో ఉన్న సర్వే నంబర్ 15లోని భూమి తమకు వారసత్వంగా వచ్చిందని గ్రామానికి చెందిన పలువురు చదును చేశారు. చెరువు చివరిలో ఉన్న చెట్లను తొలగించి మట్టి పోశారు. సుమారు ఎకరానికి పైగా కబ్జాచేసి వారం రోజుల నుంచి చదును చేస్తుండడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామపంచాయతీ గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. చెరుకు శిఖం భూమిల్లోనే గ్రామపంచాయతీ భవనం, వాటర్ ట్యాంక్ నిర్మాణం చేశారని, కబ్జా చేసిన భూమి కూడా చెరువు శిఖందేనని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో తాము కూడా పేదలమేనని ఆ భూమిని కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు..

గ్రామంలో చెరువు శిఖం భూములు కబ్జాపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూమి చదును చేస్తున్న దృశ్యాలు, గ్రామపంచాయతీ కార్యాలయానికి వేసిన తాళం, గ్రామస్తుల ఆందోళన వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కొందరు గ్రామస్తులు కలెక్టర్‌కు నేరుగా ఫోన్ చేసి కబ్జా చేస్తున్న విషయాన్ని ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామస్తులు వర్గాలుగా విడిపోయి కబ్జాలపై ఆందోళన చేస్తున్నారు. కానీ, రెవెన్యూ అధికారులు మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు.

'మనబడి' ముస్తాబు



ప్రారంభానికి సిద్ధమైన మిర్యాలగూడలోని షాబునగర్ పాఠశాల నూతన భవనం

- మన ఊరు – మన బడి కింద అభివృద్ధి
- నేడు 18 స్కూళ్ల ప్రారంభోత్సవం
- సమకూరిన సదుపాయాలు

నల్లగొండ : మనఊరు – మన బడి కింద పాఠశాలలు ముస్తాబవుతున్నాయి. జిల్లాలో మొదటి విడతగా 516 పాఠశాలలను అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. తొలుత మండలానికి రెండు మోడల్ పాఠశాలలు గుర్తించి జనవరి 5 నాటికే పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో ఎంపికైన 62 పాఠశాలకుగాను 30 స్కూళ్లలో పనులు కొనసాగుతుండగా.. 32 పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. వాటిలో 18 పాఠశాలలను బుధవారం ప్రారంభించనున్నారు. వీటిని ఆయా నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. మిగతావి ఈ నెల 10వ తేదీ నాటికి ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఓ భిక్షపతి తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అందులో బాగంగా ప్రభుత్వ పాఠశాలను మన ఊరు – మన బడి కింద అభివృద్ధి చేస్తోంది. స్కూళ్లలో అన్ని వసతులు సమకూర్చడం ద్వారా ప్రశాంత వాతావరణం ఏర్పడి విద్యార్థులు చదువు విషయంలో మెరుగుపడతారని ప్రభుత్వ ఆలోచన. అందులో భాగంగా అయితే మొదటి విడతగా జిల్లాలో 516



కనగల్లు మండలం కాశీవారిగూడెం పాఠశాల

పాఠశాలలను విద్యాశాఖ అధికారులు గుర్తించారు. ఇలా ప్రతి సంవత్సరం విడతల వారీగా పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేయనున్నారు. వీటిలో మండలానికి రెండు చొప్పున మోడల్ పాఠశాలలు గుర్తించారు. వాటిలో పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. ఇప్పటికే 70 శాతం వరకు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.

కల్పిస్తున్న సదుపాయాలు ఇలా..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణం, పాఠశాలలను బట్టి ప్రహరీ గోడ, వంటగది, మరుగుదొడ్లు, విద్యుదీకరణ, ఫ్యాన్ల ఏర్పాటుతోపాటు పాఠశాల భవనాలకు రంగులను వేస్తున్నారు. ఇద్దరికి ఒక టేబుల్ బెంచితోపాటు ఉపాధ్యాయులు, హెడ్‌మాస్టర్‌కు ప్రత్యేకంగా ఫర్నిచర్, తాగునీటి కోసం కూడా ప్రత్యేక ట్యాంక్ ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు.

నేడు ప్రారంభించే పాఠశాలలు ఇవే..

నల్లగొండ నియోజకవర్గంలోని ఎంపీఎస్‌ఎస్ కాశివారిగూడెం (తిప్పర్తి), జీపీఎస్ ఎంకేవీ పద్మానగర్, ఎంపీపీఎస్ కతాల్‌గూడ, ఎంపీపీఎస్ కాశివారిగూడెం (కనగల్), ఎంపీపీఎస్ బుడమర్లపల్లి. నకిరేకల్ నియోజకవర్గంలోని ఎంపీపీఎస్ నార్కట్‌పల్లి, ఎంపీపీఎస్ ఎల్లారెడ్డిగూడెం, ఎంపీపీఎస్ రామచంద్రాపురం. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఎంపీపీఎస్ కన్నెకల్, ఎంపీపీఎస్ చోళ్లతండా, ఎంపీపీఎస్ పలుగుతండా, ఎంపీపీఎస్ పంగవానికుంట తండా, ఎంపీపీఎస్ కొత్తపల్లి, ఎంపీపీఎస్ కాల్వపల్లి. దేవరకొండ నియోజకవర్గంలోని జీపీఎస్ గుడితండా, ఎంపీపీఎస్ పాల్లేపల్లిరాంనగర్, మిర్యాలగూడలోని ఎంపీపీఎస్ షాబునగర్, మునుగోడు నియోజకవర్గంలోని ఎంపీపీఎస్ లక్ష్మీదేవిగూడెం.

పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

మునుగోడు, చండూరు : మన ఊరు – మన బడి ఎంపిక చేసిన ప్రతి పాఠశాలకు ఆదర్శంగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. మంగళవారం మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిగూడెం ప్రాథమిక పాఠశాలను, చండూరు మండలంలోని బోడంగిపర్తి పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమ్మతులు పూర్తయినా పాఠశాలలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే చేత ప్రారంభించుకొవాలని సూచించారు. మిగిలిన పాఠశాలల్లో పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ కె.నర్సింహ తదితరులు ఉన్నారు.



మునుగోడులోని లక్ష్మీదేవిగూడెం పాఠశాల వద్ద మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

క్లుప్తంగా

నేడు యాదాద్రికి స్వామిజీల రాక

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకునేందుకు భువనేశ్వరి పీఠాధిపతులు కమాలనంద భారతీ స్వామిజీ, సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి తీర్థానంద స్వామిజీలు బుధవారం రానున్నట్లు హిందు దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కట్టిగొమ్ముల రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదాద్రీశుడిని దర్శించుకున్న అనంతరం స్వామిజీలు బాసర సరస్వతి ఆలయానికి బయల్దేరుతారన్నారు. హిందు దేవాలయాల పరిరక్షణ, గో సంరక్షణ, ఉమ్మడి కుటుంబాలపై అవగాహన కల్పించేందుకు బాసర నుంచి హంపి వరకు చేపట్టిన 10వేల కిలోమీటర్ల పాదయాత్ర విజయవంతం అయ్యేలా చూడాలని యాదాద్రీశుడిని మొక్కుకొని వెళ్తారన్నారు.

లాటరీ నిర్వహిస్తున్న వ్యక్తుల అరెస్ట్

బీబీనగర్: మండలంలోని వెంకిర్యాల గ్రామంలో సాయి కృష్ణ ఎంటర్ ప్రైజెస్ పేరిట నిషేధిత లాటరీ నిర్వహిస్తున్న ఐదుగురిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాంబ నవీన్‌కుమార్, చెర్కు మహేష్, సాంబ ప్రవీణ్, గండు మల్లయ్య, చెర్కు చిరంజీవిలు సాయి కృష్ణ ఎంటర్ ప్రైజెస్ పేరు మీద ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి వివిధ రకాల వస్తువులను నిషేధిత లాటరీ ద్వారా ఇస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఓటీ, బీబీనగర పోలీస్‌లు తనిఖీలు చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారినుంచి 16వేల నగదు, లక్కీ డ్రా కూపన్స్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాగారం వాసికి డాక్టరేట్


రజిత (ఫైల్)

వలిగొండ : మండలం నాగారం గ్రామానికి చెందిన వంగాల రజితకు డాక్టరేట్ లభించింది. ఉస్మానియా యూనివర్సిటీలో పర్యాటక అభివృద్ధి అనే అంశంపై ప్రొఫెసర్ డా.రామకృష్ణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గానూ ఆమెకు డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం ఆమె ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నంద్యాల జిల్లాలో రాష్ట్ర పురావస్తు ప్రదర్శనల శాలల శాఖలో సహాయ సంచాలకులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. డాక్టరేట్ పొందడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

రైతు పొలంలో లింగాకర్షక బుట్టల ప్రదర్శన

గరిడేపల్లి : గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గడ్డిపల్లి గ్రామంలో మంగళవారం రైతు పొలంలో లింగాకర్షక బుట్టలను లయోలా వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం వాటి ప్రముఖ్యత, వరికాండం తొలిచే పురుగులను ఏ విధంగా నియంత్రించాలో వివరించారు. ఫెరోమోన్ ట్రాఫ్ అనేది ఒక రకమైన క్రిమి ఉచ్చు, ఇది కీటకాలను ఆకర్షించడానికి ఫెరోమోన్‌ను ఉపయోగిస్తుందని తెలిపారు. సెక్స్ ఫెరోమోన్‌లు, అగ్రిగేటింగ్ ఫెరోమోన్‌లు అత్యంత సాధారణ రకాలు, చిత్రంలో ఎర్రటి రబ్బరు సెప్టావలె ఫెరోమోన్-ఇంప్రిగ్నేటెడ్ ఎర, ఒక బాటిల్ ట్రాఫ్, డెల్టా ట్రాఫ్, వాటర్ ఫాన్ 6టూఫ్ లేదా ఫన్నెల్ ట్రాఫ్ వంటి సంప్రదాయ ఉచ్చులో నిక్షిప్తం చేయబడిందని పేర్కొన్నారు. ఫెరోమోన్ ఉచ్చులు శాంప్లింగ్, ద్వారా కిటకాల జనాభాను లెక్కించడానికి, వాటిని నాశనం చేయడానికి బుట్టల చిమ్మటలు వంటి తెగుళ్లను ట్రాఫ్ చేయడానికి ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో హోమ్ సైన్స్ శాస్త్రవేత్త ఇంచార్జ్ సుగంధితో పాటు విద్యార్థులు హర్షిణి, శ్రియ, శృతి, ధనలక్ష్మి, మౌనిక, శ్రావణి, తేజశ్రీలతో పాటు రైతులు తదితరులు ఉన్నారు.

ఓం నమః శివాయ.. శంభో శంకర


ప్రభతో అగ్నిగుండంలో నడుస్తున్న అర్చకులు, భక్తులు


నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులో స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

- చెర్వుగట్టులో భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాలు
- నిప్పుల గుండా నడిచి మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ముక్కంటి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చిన అశేష భక్తజనం
- శివనామ స్మరణతో మార్మోగిన గట్టు పరిసరాలు

నార్కట్‌పల్లి : హర హర మహాదేవ.. శంభోశంకర.. బాధలు తీర్చి భవసాగరాన్ని దాటించు ముక్కంటి అంటూ భక్తులు పరమేశ్వరుడిని వేడుకున్నారు. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండాల ఘట్టాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అగ్నిగుండం గుండా నడిచేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు బారులుదీరారు. అంతకుముందు ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, అర్చకులు సతీష్ శర్మ, శ్రీకాంత్‌శర్మ, సురేష్, సిద్దుశర్మ వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి గరుడ వాహనంపై స్వామి, ఇరమూస్తి వార్ల ప్రభను అగ్నిగుండం వరకు తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి అగ్నిగుండాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల నుంచి తరలివచ్చిన అశేష భక్తులు ఓం నమః శివాయ అంటూ అగ్నిగుండం గుండా నడుచుకుంటూ వెళ్లి భక్తిని చాటుకున్నారు.

భారీ పోలీసుల బందోబస్తు

బ్రహ్మోత్సవాల సందర్భంగా చెర్వుగట్టులో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సీఐలు శివరాంరెడ్డి, ఆదిరెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అగ్ని గుండంలో నడిచే వారికి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు.

శివసత్తులు ప్రత్యేక పూజలు

స్వామివారి అగ్ని గుండాల కార్యక్రమానికి శివసత్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అగ్నిగుండంలో నడిచి భక్తిని చాటుకున్నారు. అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకున్నారు. జోగిని నిషా క్రాంతి ఆధ్వర్యంలో పూనకాలు ఊగుతూ, ఆడిపాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ జయచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషన్ మహేంద్రకుమార్, తహసీల్దార్ మురళీమోహన్, ఎంపీడీఓ యాదగిరి, కార్యనిర్వహణ అధికారి నవీన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, వెంకటయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.


పానసారం పదుతున్న భక్తురాలు



అగ్నిగుండాల్లో నడుస్తున్న శివసత్తులు, పోలీసులు, భక్తులు


భోనాలతో శివసత్తులు


శివసత్తుల పూనకాలు


బతుకమ్మ ఆడుతున్న శివసత్తులు

యాదాద్రిలో ప్రముఖుల పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఫైనాన్స్ రామకృష్ణారావు, నూతన డీసీపీ రాజేష్‌చంద్ర మంగళవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆచార్యులు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో ఉత్సవమూర్తుల వద్ద అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. స్వామిని దర్శించుకున్న వీరికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

పూర్వగిరీశుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఉదయం స్వస్తీ వాచనం.. రాత్రి అంకురారోపణ..
- నేడు ధ్వజారోహణము, బేరీ పూజ, దేవాతాహ్వానం

యాదగిరిగుట్ట: ఆలయ మూలవర్యులకు నిజాభిషేకం.. విశ్వక్సేన ఆరాధన.. జలపూజ.. ఉత్సవ నిర్వాహకులకు కంకణ ధారణతో స్వస్తీవాచనం, పుట్టమట్టిలో నవధాన్యాలను నాటడంతో అంకురారోపణము.. ఇవి పూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల తొలి రోజు వైభవాలు. ఆలయ అర్చకులు, యజ్ఞాచార్యులు, అర్చక బృందం, పారాయణీకులు పంచరాత్రాగమ శాస్త్రానుసారంగా శ్రీస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ తొలి పూజలో అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ఈవో గీతారెడ్డి, ప్రధానార్చకులు, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

విశ్వక్సేన ఆరాధన.. స్వస్తివాచనంతో...

శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవముల ఆరంభమున చరాచర జగత్తు అంతా భగవానుని కటాక్షముతో శుభములు పొందాలని, ఉత్సవ పరిసమాప్తి వరకు ఎలాంటి ఆటంకములు జరగకూడదని స్వస్తీ వాచన మంత్రములతో శ్రీవిశ్వక్సేనారాధనతో పూజలు చేపట్టారు. ఈ పూజలతో భగవానుని ప్రార్థించడమే ఆచార్యులు పేర్కొన్నారు.

రక్షాబంధనం

ఆగమ శాస్త్రానుసారముగా జగద్రక్షకుడైన పరమాత్మను ఆరాధన, అర్చనాదులు గావించి శ్రీస్వామి వారికి, అమ్మవారికి రక్ష బంధన వేడుక చేపట్టారు. ఉత్సవ నిర్వాహకులు, భక్తులు కూడా ఈ రక్ష బంధన ధరించి భగవంతుడి అనుగ్రహం పొందారు.

పుణ్యాహ వాచనం

బ్రహ్మోత్సవములలో పుణ్యాహ వాచన వేడుకలో మూలవరులకు, ఆలయ పరిసర ప్రాంతములలో పుణ్యాహ వాచన మంత్ర జపమును ప్రోక్షణ గావించారు. కల్యాణ సంబారములు, స్థల ద్రవ్య, శుద్ధ్యర్థం శుద్ధి పుణ్యాహ వాచన కైంకర్యం నిర్వహించారు. నిత్యారాధనల అనంతరం సాయంత్రం ఆలయ మండపంలో అంకురారోపణం, మృత్సంగ్రహణ వేడుకలను ఆచార్యులు నిర్వహించారు. ఆలయం నుంచి తిరువీధుల గుండా మండపానికి చేరుకున్నారు. అక్కడ భూమాతను పూజించి, మృతికను (మట్టిని) సేకరించారు. తిరిగి ఆ మృతికను ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన పాలికలలో నింపి, వాటిలో నవధాన్యములు చల్లారు. ఉత్సవ సమాప్తి వరకు పాలు మొదలగు శుద్ధ జలములతో పాలికలను తడిపి ప్రతి నిత్యం ఆరాధనలు గావిస్తామని ఆచార్యులు వెల్లడించారు. ఈ వేడుకలను ప్రధాన అర్చకులు, యజ్ఞచార్యులు, అర్చకబృందం, పారాయణికులచే నిర్వహించారు.


శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ఉత్సవాల్లో నేడు

శ్రీస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం 10గంటలకు ధ్వజారోహణం, వేద పారాయణం నిర్వహిస్తారు. సాయంత్రం భేరి పూజ, దేవతాహ్వానం జరిపిస్తారు. ధ్వజారోహనం జరిగే సమయంలో ఆచార్యులు అంతా ధ్వజస్తంభం వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.


పాతగుట్ట నృసింహుడి బ్రహ్మోత్సవాల్లో స్వస్తీవాచన పూజ చేస్తున్న అర్చకులు


శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు


శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఆలయ ఈఓ గీతారెడ్డి, అధికారులు, అర్చకులు

రాజ్యాధికారంతోనే బడుగుల అభివృద్ధి


మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

- దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్

నూతనకల్ : అణగారిన వర్గాలకు చెందిన వ్యక్తుల చేతుల్లో అధికారం ఉన్నప్పుడే బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని డీఎస్‌పీ (దళిత శక్తి ప్రోగ్రాం) రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ అన్నారు. మంగళవారం స్వరాజ్య పాదయాత్ర నూతనకల్ మండల పరిధిలోని తాళ్ల సింగారం, యడవెల్లి గ్రామాల మీదుగా మండల కేంద్రానికి చేరుకుంది. పాదయాత్ర 7,372 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల్లో అధికారాలు కొన్ని కుటుంబాలకు చెందిన వ్యక్తుల చేతుల్లోనే బందీ అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలోలక్ష్మణ్. కిరణ్‌కుమార్, శ్రీనివాస్, బాలు, రాము, భాస్కర్, జమదగ్ని, సురేష్, ప్రవీణ్, మధు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నల్లగొండ క్రైం : ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పానగల్ సమీపంలోని సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన మహ్మద్ అఖిల్ (21) హైదరాబాద్‌లో ఓ ట్రాన్స్‌ఫోర్ట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అవసరం మేరకు అఖిల్ తండ్రిని రూ. 2లక్షలు ఇవ్వాలని అడుగగా లేవని చెప్పాడు. దీంతో మనస్తాపం చెందిన అఖిల్ ఇంటి పైభాగంలోని రేకుల గదికి వెళ్లి ఉరేసుకున్నాడు. కుమారుడు ఎంతకీ కిందకు రాక పోవడంతో తండ్రి రబ్బాని వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. రబ్బాని ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలి

- యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి,యాదాద్రి : జంతు సంరక్షణపై విద్యార్థి దశ నుంచి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జంతు సంక్షేమ పక్షోత్సవంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, కేజీబీవీ విద్యార్థినులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాస రచన, వకృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి మంగళవారం కలెక్టరేట్‌లో ఆమె బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జంతువుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమ కలిగి ఉండాలని, జంతు సంరక్షణకు ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన ఉండాలని తెలిపారు. విద్యార్థి దశ నుంచే జంతు సంరక్షణ పట్ల అవగాహన కలిగించడానికి జిల్లాలో 185 ప్రభుత్వ పాఠశాలల్లో కరుణ క్లబ్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులతో ప్రతి క్లబ్ నుంచి ఉత్సాహవంతులైన వారిని చైల్డ్ అంబాసిడర్‌గా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. మనుషులు, జంతువుల మధ్య అనుబంధం తెలిపి చార్లీ 777 చలన చిత్రాన్ని సమావేశం మందిరంలో విద్యార్థులకు ప్రదర్శించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ కృష్ణ, డీఈఓ నారాయణరెడ్డి, రాష్ట్ర జీవ జంతు కారుణ్య మండలి సభ్యులు మహేశ్ అగర్వాల్, తెలంగాణ గోశాల మండలి సభ్యులు రోజా, పశు సంవర్ధక శాఖ సహాయక సంచాలకులు డాక్టర్ ఐలయ్య, డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ పండింట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ సత్పతి

అప్పు డబ్బులు అడిగినందుకు..

సోదరిని హత్య చేసిన తమ్ముడు

- రోకలి బండతో మోది ఘాతుకం
- చందంపేట మండలంలో దారుణం


చిట్టి (ఫైల్)

చందంపేట : అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు ఓ యువకుడు ఘాతుకానికి తెగబడ్డాడు. మద్యం మత్తులో తోడబుట్టిన సోదరి అని చూడకుండా రోకలి బండతో మోది దారుణంగా హత్య చేశారు. చందంపేట మండల పరిధిలో ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని హంక్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని రూప్లాతండా గ్రామానికి చెందిన చిట్టి (30) పది సంవత్సరాల క్రితం భర్తతో విడాకులు తీసుకొని కూలి పనులు చేసుకుంటూ తల్లిగారి ఇంటి వద్దే ఉంటోంది. గతంలో తన తమ్ముడు శ్రీనుకు చిట్టి రూ.40వేలు అప్పుగా ఇచ్చింది. ఆ విషయమై తమ్ముడిని కొన్ని రోజులుగా డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం మధ్యాహ్నం ఇంట్లోనే మద్యం మత్తులో ఉన్న శ్రీనును డబ్బులు ఇవ్వాలని అడిగింది. దీంతో కోపోద్రిక్తుడైన శ్రీను రోకలిబండతో చిట్టి తలపై బలంగా బాదాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో స్పృహ కోల్పోయిన చిట్టిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ పరుశురాం ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.


వివరాలు తెలుసుకుంటున్న సీఐ

స్కూల్ బస్సు చక్రాల కింద నలిగిన చిన్నారి

- డ్రైవర్ నిర్లక్ష్యంతో టైరు కిందపడి మృతి
- చివ్వెంల మండలం కోమటికుంటలో విషాదం


నైనిక (ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట) : డ్రైవర్ నిర్లక్ష్యానికి స్కూల్ బస్ చక్రాల కింద నలిగి ఓ చిన్నారి ప్రాణాలు విడిచింది. సూర్యాపేట జిల్లాలో ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చిన ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామ ఆవాసం కోమటికుంట గ్రామానికి చెందిన మెడారపు శేఖర్, నాగరాణి దంపతుల కుమార్తె ఇషిక సూర్యాపేట పట్టణంలోని అక్షర పాఠశాలలో ఎల్‌కేజీ చవుదుతోంది. రోజు మాదిరిగానే సోమవారం స్కూల్ బస్సులో పాఠశాలకు వెళ్లిన ఇషిక సాయంత్రం ఇంటికి బయలుదేరింది. ఈ క్రమంలో ఇషికను లోనికి తీసుకెళ్లేందుకు తల్లి నాగరాణి, ఆమె చెల్లి నైనిక (3) ఇంటి వద్ద వేచి చూస్తున్నారు. బస్సు రాగానే ఇషికను తీసుకుని నాగరాణి ఇంట్లోకి వెళ్లింది. అయితే, ఈ క్రమంలో నైనిక ఆడుకుంటూ బస్సు ముందు భాగంలోకి వెళ్లి నిలబడింది. గమనించని డ్రైవర్ లక్ష్మీనారాయరణ బస్సును కదిలించగా ముందు టైరు నైనికపై ఎక్కింది. గమనించిన నాగరాణి కేకలు వేయడంతో డ్రైవర్ బస్సును వెనుకకు జరిపాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నైనికను తొలుత సూర్యాపేట ఆస్పత్రికి, అక్కడినుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు.

పాఠశాల ఎదుట ఆందోళన

సూర్యాపేటటౌన్ : చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట మృతురాలి బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేశారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే చిన్నారి మృతి చెందిందని ఆరోపించారు. చిన్నారి నైనిక కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంపై చర్యలు తీసుకొని పాఠశాలను సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పోలెబోయిన కిరణ్‌కుమార్, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, గుండాల సందీప్, చామకూరి మహేందర్, నిద్ర సంపత్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'డబుల్ బెడ్‌రూం' దరఖాస్తుదారుల ఆందోళన

- అధికార పార్టీ వారికే ఇళ్లు ఇచ్చారని ఆరోపణ
- పెట్రోల్ డబ్బాలతో రాస్తారోకో
- కొలనుపాకలో ఉద్రిక్తత


పెట్రోల్ డబ్బాలతో రాస్తారోకో చేస్తున్న కొలనుపాక గ్రామస్తులు

ఆలేరు రూరల్ : అధికార పార్టీ కి చెందిన వారికే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించారని, అర్హతలున్న తమకు ఇళ్లు ఇవ్వలేదంటూ ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో పలువురు పెట్రోల్ డబ్బాలు చేత బట్టుకుని ఆందోళనకు దిగారు. కొలనుపాక డబుల్ బెడ్ రూం ఇళ్ల ముందు గల ఆలేరు- చేర్యాల రోడ్డుపై రాస్తారోకో దిగారు. గ్రామంలో 64 ఇళ్లకు 153 మంది దరఖాస్తు చేసుకోగా అధికారులు సర్వే చేపట్టి తొతుత 67 మందిని అర్హులుగా గుర్తించారు. వారిలో 64 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే, అధికార పార్టీకి చెందిన వారికి ఇళ్లు ఉండి ఉద్యోగం చేస్తున్న వారికి డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయించారని ఆరోపించారు. సొంత ఇల్లు, భూమిలేని వారికే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సునీతకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి వచ్చిన ఎమ్మెల్యేను కొద్దిసేపు అడ్డుకున్నారు. సభ వేదిక వద్ద కుర్చీలు విసిరేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. దాదపు గంటన్నర పాటు రాస్తోరోకో చేశారు. ఎంపిక పాదర్శకంగా పాటించలేదని ఎమ్మెల్యేతో వాపోయారు. లబ్ధిదారుల పేర్లు స్వయంగా ఎమ్మెల్యే చదివి వినిపించారు. ఆందోళనకారులకు పోలీసులు నచ్చజెప్పి పక్కకు తప్పించడంతో ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొనసాగించారు.


కొలనుపాకలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు